సాక్షి ఖమ్మం

సోమవారం ׀ 27 ׀ ఫిబ్రవరి ׀ 2023



ప్రతిభ నై.. పైరవీలకే సై..

ప్రతిభావంతులైన క్రీడాకారులను పక్కనబెట్టి ప్రతిభ లేని వారిని జిల్లా, రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 10లో



మరోసారి గెలిపిస్తే మంచి పదవి

సత్తుపల్లి ఎమ్మెల్యేగా వెంకటవీరయ్యను మరోసారి గెలిపిస్తే మంచి పదవి వస్తుందని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీఎస్‌ఆర్టీసీకి జాతీయ అవార్డులపై మంత్రి హర్షం



ఖమ్మంమయూరిసెంటర్ : రహదారి భద్రత కేటగిరీలో టీఎస్ ఆర్టీసీలోని ఇద్దరు డ్రైవర్లకు ప్రతిష్టాత్మక 'హీరోస్ ఆన్ ది రోడ్' పురస్కారాలు రావడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్(ఏఎస్‌ఆర్టీయూ) ప్రకటించిన ఈ పురస్కారాలు రావడంతో సంస్థపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. విజేతలైన కుషాయిగూడ డిపోకు చెందిన కె.రంగారెడ్డి, సూర్యాపేట డిపోకు చెందిన కె.సోమిరెడ్డిలకు కేంద్ర రోడ్లు, ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ ఏప్రిల్ 18న న్యూఢిల్లీలో అవార్డులు అందజేస్తారని, ఇద్దరు డ్రైవర్లను సంస్థ తరఫున అభినందిస్తున్నామని తెలిపారు. సంస్థలోని మిగతా డ్రైవర్లు కూడా వీరి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించిందని, ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి డిపోలోనూ ప్రత్యేక అధికారిని నియమించామని, రాష్ట్రంలోని అద్దె బస్సు డ్రైవర్లందరికీ వారం రోజుల పాటు సమగ్ర శిక్షణ ఇచ్చామని వివరించారు.

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్ : సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మంలోని టేకులపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 195 మంది దరఖాస్తు చేసుకోగా 182 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 217 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరు కాగా.. 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎస్సీ గురుకుల ఆర్సీవో ప్రత్యూష సందర్శించారు.

రామయ్యకు తలంబ్రాల బియ్యం



ఆలయ అధికారులకు బియ్యం అందజేస్తున్న రామభక్తులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణం సందర్భంగా పంపిణీ చేసే తలంబ్రాల బియ్యాన్ని భక్తులు అందజేశారు. ఏపీలోని జంగారెడ్డిగూడేనికి చెందిన స్వామివారి భక్తులు ఆదివారం రామయ్యను దర్శించుకుని 80 క్వింటాళ్ల బియ్యాన్ని ఆలయ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అనిల్, నిరంజన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు.

సాగుకే హై పవర్!

- వ్యవసాయరంగానికి పెరుగుతున్న విద్యుత్ వాడకం
- నెల రోజుల్లో 18 లక్షల మిలియన్ యూనిట్ల పెరుగుదల
- పంట నూర్పిడి అయ్యే వరకూ ఇదే పరిస్థితి..
- కెపాసిటర్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఎన్పీడీసీఎల్



తల్లాడ మండలం తెలగవరంలో అమర్చనున్న కెపాసిటర్లను చూపెడుతున్న రైతులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రోజురోజుకూ ఎండలు మండుతుండడంతో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాలకు సంబంధించి గత నెలతో పోలిస్తే ఈ నెలలో సుమారు మూడో వంతు వాడకం పెరిగింది. వినియోగంలో 40 శాతం పైగా వ్యవసాయ కనెక్షన్లదే ఉంది. పంటల నూర్పిడి పనులు ముగిసే ఏప్రిల్ 15 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక ఎండల కారణంగా గృహ అవసరాల వినియోగంలోనూ కొంత పెరుగుదల కనిపిస్తోంది. వ్యవసాయ కనెక్షన్లకు ఆటోమెటిక్ స్టార్టర్లతో ట్రాన్స్‌ఫార్మర్ల పై లోడ్ పడుతుండడం తదితర కారణాలతో ఎన్పీడీసీఎల్ యంత్రాంగం వీటి తొలగింపు, కెపాసిటర్ల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పిస్తోంది.

వ్యవసాయానికి 40 శాతం

జిల్లాలో 1.10 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సుమారు 2.50 లక్షల ఎకరాలకు పైగా మోటార్లతోనే పంటలు సాగవుతున్నాయి. యాసంగిలో వరి, మిర్చి మొక్కజొన్న పంటలకు నీటి వినియోగం ఎక్కువ. నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు నాన్ ఆయకట్టులోనూ విద్యుత్ మోటార్లపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేశారు. గత నెల 25 నుంచి ఈనెల 15 వరకు విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బంది పడ్డారు. జిల్లాలో ఎప్పుడు కరెంట్ వస్తుందో.. పోతుందో తెలియక పంటలు వడబడుతుండడంతో ఆందోళన బాట పట్టారు. కానీ గత 15 రోజులుగా జిల్లాలో ఎక్కడా కోత లేకుండా సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వినియోగిస్తున్న విద్యుత్‌లో 40 శాతం పైగా వ్యవసాయానికేనని వారు అంటున్నారు. పంట పూర్తిగా చేతికందే ఏప్రిల్ 15 వరకు విద్యుత్ వినియోగంలో సింహభాగం వ్యవసాయ రంగానికే అవసరమని అంచనా.

జిల్లాలో అన్నిరకాల కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ వినియోగం (నెలకు లక్షల మిలియన్ యూనిట్లలో)

ఏడాది	నెల	వినియోగం
2022	జనవరి	55.90
2022	ఫిబ్రవరి	63.0
2023	జనవరి	58.10
2023	ఫిబ్రవరి (24 వరకు)	76.20

వృథా కట్టడికి స్టార్టర్ల తొలగింపు..

విద్యుత్ వాడకం, నీటి వృథా కట్టడికి.. మోటార్ల నీటి తోడకం సామర్థ్యం పెంచేలా రాష్ట్ర ఈఆర్సీ(తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్) ఇటీవల చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో స్టార్టర్లను రైతులు స్వచ్ఛందంగా తీసేసేలా అవగాహన కల్పించాలని ఎన్పీడీసీఎల్ సిబ్బందిని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు మోటార్లకు అమర్చిన 3,800 స్టార్టర్లను తొలగించగా.. రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ పరిణామాలతో విద్యుత్ అధికారులు, సిబ్బంది.. స్టార్టర్ల వల్ల కలిగే నష్టాలు, కెపాసిటర్ల వల్లే కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించగా వారే స్వచ్ఛందంగా స్టార్టర్లు తీశారు. అయితే విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉంటే స్టార్టర్ల అవసరం ఉండదని, కోతల కారణంగానే స్టార్టర్లు బిగించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో సరఫరా ఇస్తుండడంతో స్టార్టర్లు బిగించి జాగారం బాధ నుంచి బయటపడుతున్నామని వారు అంటున్నారు.

పీక్ అవర్‌లో కట్..

వ్యవసాయానికి సంబంధించి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండడం లేదు. పట్టణాలు, పల్లెలు, పరిశ్రమల్లో ఈ నాలుగు గంటల సమయం విద్యుత్ వాడకం(పీక్ అవర్) ఎక్కువగా ఉంటుంది. వేసవి కావడంతో ఈ నాలుగు గంటల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ సమయంలోనే వ్యవసాయానికి కరెంట్ సరఫరా కావడం లేదు. అయితే మిగిలిన సమయాల్లో పవర్‌ఫుల్‌గా కరెంట్ ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగంలో గత ఏడాది, ఈ ఏడాది జనవరి 24 తేదీలను పరిశీలిస్తే 2.2 లక్షల మిలియన్ యూనిట్లు, అలాగే ఫిబ్రవరి నెలతో పోలిస్తే 13.2 లక్షల మిలియన్ యూనిట్ల వాడకం పెరిగింది. వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాల వినియోగంలో పెరగుదల ఉండగా.. అత్యధికం వ్యవసాయానిదే.

కెపాసిటర్లతో ఉపయోగం



రైతులు మోటార్లకు కెపాసిటర్లను పెట్టుకోవడం వల్ల ఇబ్బందులు ఉండవు. మోటారు నీటి తోడకం సామర్థ్యం కూడా పెరుగుతుంది. విద్యుత్ సరఫరాలో లో వోల్టేజ్, హై వోల్టేజ్ ఉన్నా మోటార్లు మరమ్మతులకు గురికావు. ఆటో స్టార్టర్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఒకే సారి భారం పడి కాలిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – ఎ.సురేందర్, ఎస్‌ఈ, విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్, ఖమ్మం

డీఏఓ పరీక్ష ప్రశాంతం

- కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్
- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు వెనక్కు



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ పరీక్ష కేంద్రంలో సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్



ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను గేటు బయటే నిలిపివేసిన పోలీసులు

ఖమ్మం సహకారనగర్ : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 27 కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,426మంది అభ్యర్థులకు గాను 6,478మంది హాజరు కాగా 2,948 మంది గైర్హాజరయ్యారు. కాగా, సాయంత్రం పరీక్షకు 6,404 మంది హాజరు కాగా 3,027మంది గైర్హాజరయ్యారు.

నిబంధనలు కఠినం..

డీఏఓ పరీక్షకు నిబంధనలు కఠినతరం చేశారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి తీసుకెళ్లనివ్వలేదు. ఉదయం 8 : 30 గంటల నుంచి 9 : 45 గంటల వరకు కేంద్రంలోకి అనుమతించి, అనంతరం గేటుకు తాళం వేశారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను వెనక్కు పంపించారు. హాల్ టికెట్, పెన్, వాటర్ బాటిల్, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొచ్చిన వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతించారు. షూ వేసుకొచ్చిన వారిని సమీపంలో భద్రపర్చుకోవాలని సూచించటంతో వారు క్లాక్ రూంలో, కొద్దిమంది పరీక్ష కేంద్రాల ప్రాంగణంలో ఉంచారు. పరీక్ష ప్యాడ్‌లను సైతం లోనికి అనుమతించలేదు.

చివరి నిమిషంలో పరుగులు..

ప్రతి పరీక్షకు హాల్ టికెట్లలో అభ్యర్థులను ఏ సమయం నుంచి ఏ సమయం వరకు అనుమతిస్తారో స్పష్టంగా ప్రకటిస్తున్నప్పటికీ కొందరు పట్టించుకోవటం లేదని తెలుస్తోంది. 9 : 45 గంటల తర్వాత పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేసినప్పటికీ పలు కేంద్రాలకు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో తిప్పి పంపించారు. మరి కొద్దిమంది చివరి సమయాల్లో ఉరుకులు, పరుకులతో కేంద్రాల్లోకి వెళ్లారు.

అదనపు కలెక్టర్ సందర్శన

డీఏఓ పరీక్షలను అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ పర్యవేక్షించారు. నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్, తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు.

‘సీతారామ’ పెండింగ్ పనులపై సమీక్ష


మంత్రి హరీష్‌రావు, ఇరిగేషన్ సెక్రటరీతో మాట్లాడిన మాజీ మంత్రి తుమ్మల



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సీతారామ ప్రాజెక్టులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తే సత్తుపల్లి ప్రాంతంలోని ఆయకట్టుకు నీరు అందుబాటులోకి వస్తుందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఆయన స్వగృహంలో నీటి పారుదల శాఖ అధికారులతో సీతారామ ప్రాజెక్టు పెండింగ్ పనులపై చర్చించారు. ఇందులో ప్రధానంగా యాతాలకుంట వద్ద టన్నెల్ నిర్మించాల్సి ఉందని, అయితే ఇక్కడ భూసేకరణ సమస్యగా ఉన్నట్లు అధికారులు తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఒకరిద్దరు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీనిపై తుమ్మల మంత్రి తన్నీరు హరీష్‌రావు, నీటిపారుదల శాఖ సెక్రటరీ రజత్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భూసేకరణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లకు ఫోన్ చేసి పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే లిఫ్టుల నిర్మాణం పూర్తయిందని, రోడ్ క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉందన్నారు. వేసవి కాలంలో ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే బేతుపల్లి కింద 300 నుంచి 400 చెరువుల వరకు నిండుతాయని, దాదాపు 1.50 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వవచ్చని వివరించారు. సీతారామ ప్రాజెక్టు తన కల అని, ఈ పనులతో బేతుపల్లి చెరువుతోపాటు లంకాసాగర్ ప్రాజెక్టులోకి కూడా నీరు వస్తుందని అన్నారు. దీనివల్ల నాగార్జున సాగర్ నీరు రాకపోయినా.. రైతులకు ఇబ్బంది ఉండదన్నారు. పెండింగ్ పనులను జూన్, జూలై నెలల్లో పూర్తి చేయాలని ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డికి తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెరగనున్న ఆయకట్టు



భక్తరామదాసు ప్రాజెక్టు (ఇన్‌సెట్) నిలిచిపోయిన చోట కాలువలు తవ్వుతున్న దృశ్యం



- మరో 21 వేల ఎకరాలకు భక్త రామదాసు' నీరు
- కోర్టు కేసుల ఉపసంహరణతో మొదలైన కాల్వల తవ్వకం
- ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల పనులు ప్రారంభం

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలోని కరువు పీడిత ప్రాంతమైన కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలను సస్యశ్యామలం చేయడంతో పాటు ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన భక్తరామదాసు ప్రాజెక్టు కింద మరింత ఆయకట్టుకు నీరు అందనుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో తవ్విన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ కాల్వలను ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేసి ఐదేళ్లుగా సాగర్ జలాలను ఆయా మండలాలకు సరఫరా చేస్తున్నారు. అయితే, ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 76,063 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా పలు అవాంతరాలతో ప్రస్తుతం 55 వేల ఎకరాలకే అందుతోంది. మిగిలిన 21 వేల ఎకరాలకూ అందించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టిన కసరత్తు కొలిక్కి రావడంతో త్వరలోనే కూసుమంచి మండలంలో 9 వేలు, తిరుమలాయపాలెం మండలంలో 12 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

కోర్టు కేసులతో అవాంతరాలు

దివంగత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో శ్రీరాంసాగర్ 60 డీబీఎం మెయిన్ కెనాల్ తవ్వకం పూర్తయినప్పటికీ ఆయా గ్రామాలకు నీరు సరఫరా చేసేందుకు తవ్వాల్సిన మైనర్ కాల్వలు పలు చోట్ల నిలిచిపోయాయి. నాడు కూసుమంచి మండలంలో కొందరు రైతులు తాము కాల్వల కింద కోల్పోతున్న భూములకు పరిహారం పెంచాలని కోర్టుకెక్కారు. దీంతో కాల్వల నిర్మాణం నిలిచి నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందలేదు. ఆయా గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించిన రైతులకు పరిహారం పెంచి ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు విడుదల చేయించగా, రైతులు కేసులు ఉపసంహరించుకున్నారు. దీంతో కాల్వల తవ్వకం మొదలుకావడంతో ఆయా గ్రామాల రైతుల కష్టాలు తీరనున్నాయి.

76వేల ఎకరాలకు సాగునీరు..

భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా 76,063 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ఆయకట్టులో తిరుమలాయపాలెం మండలంలో 34,356 ఎకరాలు, కూసుమంచి మండలంలో 21,140 ఎకరాలు, ఖమ్మం రూరల్ మండలంలో 16,512 ఎకరాలు, నేలకొండపల్లి మండలంలో 1530 ఎకరాలు, ముదిగొండ మండలంలో 2,525 ఎకరాలు ఉన్నాయి.

పూర్తి ఆయకట్టుకు సాగునీరు



భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా మరింత ఆయకట్టుకు నీరందేలా కృషి చేస్తున్నాం. రైతులు కోర్టు కేసులు ఉపసంహరించుకున్నారు. దీంతో మరో 21 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. ఏడాదిలోగా పనులు పూర్తి చేస్తాం. – బాణాల రమేష్‌రెడ్డి, డీఈఈ, జల వనరుల శాఖ

నీళ్లొస్తే మా ఇబ్బందులు పోతాయి..



మాకు ఇంతవరకు భక్త రామదాసు ప్రాజెక్టు నుంచి నీళ్లు రాలేదు. మాకు చెరువులు, కుంటలు లేవు. వానలతోనే పంటలు పండించాలి. ఇప్పుడు నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. మా చేలకు నీళ్లు పారితే ఇబ్బందులు పోతాయి. – బానోత్ మత్రు, రైతు, బోటిమీది తండా

16 అడుగులకు ‘పాలేరు’

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం ఆదివారం 16 అడుగులకు చేరింది. శనివారం 13.60 అడుగులకు పడిపోగా ఎడమ, పాలేరు కాల్వల ఆయకట్టుకు అధికారులు నీటి విడుదల నిలిపేశారు. దీంతో సాగర్ నుంచి రిజర్వాయర్‌కు 2,918 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుండటంతో నీటిమట్టం ఒక్కరోజే సుమారు 3 అడుగులు పెరిగింది. ఇది మరింత పెరిగాక ఆయకట్టుకు తిరిగి నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికే కళంకం

- విద్యాశాఖలో వరుస ఘటనలు
- ఏసీబీకి దొరికిన హెచ్‌ఎం
- విద్యార్థులను దండించి సస్పెన్షన్‌కు గురైన ప్రిన్సిపాల్
- మసకబారుతున్న విద్యాశాఖ ప్రతిష్ట

మధిర: భావి భారత పౌరుల తలరాతలు మార్చే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉంటుంది. నీతి, నిజాయితీలకు, క్రమశిక్షణకు మారుపేరుగా, అవినీతి రహిత సమాజానికి ఆదర్శంగా టీచర్లు ఉంటారని అందరి నమ్మకం. కానీ ఆ నమ్మకాన్ని కొందరు వమ్ము చేస్తుండడంతో విద్యారంగం కూడా భ్రష్టుపట్టిపోతోంది. అవినీతికి కాదేది అనర్హం అంటూ ఉపాధ్యాయులు సైతం లంచాలకు అలవాటు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన వృత్తిలో ఉండే గురువులే దారి తప్పితే సమాజంలో కళంకితం అవుతుందని ఆందోళన చెందుతున్నారు. మధిరలో ఇటీవల జరిగిన రెండు వరస ఘటనలు విద్యాశాఖకు మచ్చ తెచ్చిపెట్టాయి. స్వాతంత్రానికి ముందే ఉర్దూ పాఠశాలలు కూడా నిర్వహించి, నాడు గ్రంథాలయాల్లో జ్ఞానాన్ని పెంపొందించుకొని దేశ విదేశాల్లో స్థిర పడిన ఎంతోమంది ఈ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. ఈ క్రమంలో ఇలాంటి వరుస ఘటనలు చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల పలుచోట్ల బాలికల పట్ల ఉపాధ్యాయులు సైతం అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.

ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి, పోక్సో కేసు నమోదు..

ఇటీవల కాలంలో వైరా మండలం కేజీ సిరిపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన సాలాది రామారావు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత ఆ హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం, అతనిపై పోక్సో కేసు నమోదు కావడం తెలిసిందే.

అవినీతి మచ్చ...

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన మధిర జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాతంగి శ్రీలత అత్యాశకు పోయి సమాజం సిగ్గుపడేలా కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఉపాధ్యాయుల్లో అవినీతికి తావుండదు. కానీ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అటు ఉపాధ్యాయులకు, ఇటు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన పరిస్థితుల్లో కాంట్రాక్టర్ దగ్గర కమీషన్ తీసుకొని అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడి విద్యాశాఖకు తలవంపులు తీసుకొచ్చారు.

మెనూ పాటించడం లేదంటే..

మధిరలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నసీమా బేగం విద్యార్థులను దండించి సస్పెన్షన్‌కు గురయ్యారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని అడిగినందుకు ఈనెల 18న ప్రిన్సిపాల్ విద్యార్థులను తీవ్రంగా కొట్టడంతో వాతలు పడ్డాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులను కొట్టడం నేరం. ఈ విషయం తెలిసినప్పటికీ ప్రిన్సిపాల్ అలా వ్యవహరించడం తీవ్ర దుమారాన్ని లేపింది. దీనిపై విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేయడంతో పాటు తల్లిదండ్రులు కూడా పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి అబ్దుల్ జావిద్ పాషా ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణ జరిపారు. గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ జ్యోతి ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో గురుకుల విద్యాసంస్థల రాష్ట్ర కార్యదర్శి డి.మల్లయ్య ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ నసీమాను సస్పెండ్ చేశారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఇద్దరు మహిళా ఉపాధ్యాయినులు చేసిన పనులతో జిల్లా విద్యా శాఖ రాష్ట్రంలోనే సంచలనంగా మారింది.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

ఖమ్మం సహకారనగర్ : మధిర జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీలతను సస్పెండ్ చేస్తూ డీఈఓ సోమశేఖర శర్మ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మన బస్తీ – మన బడి కార్యక్రమం కింద పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టగా, అందుకు సంబంధించిన చెక్కు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ హెచ్‌ఎం ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెపై వేటు పడింది.

భౌ..బోయ్.. వీధి కుక్కలు


నగరంలోని ప్రకాష్‌నగర్‌లో గుంపుగా ఉన్న కుక్కలు

జిల్లా కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా మారింది. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ కుక్కలు సంచరిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ మనుషులను కరుస్తున్నాయి. పాదచారులు, వాహనచోదకుల వెంట పడుతుండటంతో వారు కంగారు పడుతున్నారు. ఖమ్మం నగరంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ఇటీవల రోజుకు పదివరకు కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


మామిళ్లగూడెం రోడ్డులో సైకిల్ పై వెళ్తున్న బాలుడి వెంట పడుతున్న కుక్క


కుమ్మరి వాడలో కుక్కల సంచారం


ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద కుక్కను చూసి భయపడుతున్న యువతులు

క్లుప్తంగా

ఆరోగ్య సమాజం కోసం కృషి చేయాలి


మాట్లాడుతున్న ప్రజాకవి జయరాజు

కొత్తగూడెంఅర్బన్: ఆరోగ్య సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ ప్రజా కవి, గాయకులు డాక్టర్ జి.జయరాజు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన ఆహారం, పద్ధతుల గురించి వివరించారు. ప్రాచీన వైద్య విధానాల ద్వారా భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని, దాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైని ఉందని అన్నారు. అనంతరం వైద్యులు చింతా రవీందర్, హకీమ్, అనిల్ మాట్లాడుతూ ఆరోగ్య సలహాలు, సూచనల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు కనకరాజు, శైలజ, ఎంవీవి వెంకటపుల్లయ్య, సుగుణారావు, మొక్కల వెంకటయ్య, శోభారాణి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

భద్రాద్రి బాహుబలికి బంగారు పతకం


పతకం అందుకుంటున్న లోక్‌నాథ్

భద్రాచలంటౌన్: బాడీ బిల్డింగ్ పోటీలలో భద్రాద్రి బాహుబలికి మరో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో శనివారం ముగిసిన స్టీల్ మ్యాన్ బాడీ బిల్డింగ్ పోటీలలో పట్టణానికి చెందిన బండారు లోక్‌నాథ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకాన్ని సాధించారు. ఈ పోటీలలో ఐదు రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా పాల్గొనగా లోక్‌నాథ్‌ను బంగారు పతకం వరించింది. గతంలో మిస్టర్ తెలంగాణగా ఎంపికైన లోక్‌నాథ్.. మిస్టర్ ఇండియా పోటీలకు సైతం అర్హత సాధించాడు.

సాగర్ కాలువలో పడి యువకుడు మృతి


సాగర్ కాలువలో గోపాలకృష్ణ మృతదేహం

కల్లూరు: నాగార్జునసాగర్ ఎడమకాలువ కల్లూరు డివిజన్ పరిధిలోని మధిర బ్రాంచ్ కెనాల్ వద్ద కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వెనుక ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రఘు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు తల్లాడ మండలం ముద్దునూరు గ్రామానికి చెందిన మిరియాల సత్యనారాయణ కుమారుడు గోపాలకృష్ణ (27) గా గుర్తించారు. గోపాలకృష్ణ హోమ్‌డిజైనర్ కార్మికునిగా పని చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి స్టేజీ సమీపంలో ఓ కోల్డ్ స్టోరేజీ ప్రారంభోత్సవానికి వచ్చిన రైతులు ట్రాక్టర్‌లో సీతారాంపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రైతులు కొక్కిరేణి సమీపంలోని కోల్డ్ స్టోరేజీ ప్రారంభోత్సవానికి వచ్చి తిరిగి ట్రాక్టర్‌లో వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సీతారాంపురం గ్రామానికి చెందిన బెల్లం కృష్ణయ్య, శివ, దొంతగాని వీరబాబు, చంద్రయ్య, రాము అనే రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఆదివా రం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం కాలేజీకి వెళ్లి వచ్చిన తర్వాత బయటకని వెళ్లిన విద్యార్థిని తిరిగి రాలేదని ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌పై దాడి

సింగరేణి(కొత్తగూడెం): విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్స్‌పై దాడిచేసిన ఘటన ఆదివారం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో చోటుచేసుకుంది. షీ టీమ్ ఎస్‌ఐ పి.రమాదేవి కథనం ప్రకారం.. సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ వరుణ్య.. అక్కడే పనిచేస్తున్న స్కావెంజర్‌కు పనిచెప్పారు. స్టాఫ్ నర్స్ చెప్పిన పనిని చేయకపోవటమే కాకుండా ఆమెపై దుర్భాషలాడుతూ దాడి చేశారు. సమాచారం అందుకున్న షీటీం ఎస్‌ఐ రమాదేవి ఘటనా స్థలానికి చేరుకుని స్కావెంజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరోసారి గెలిపిస్తే మంచి పదవి వస్తుంది..

- రూ.100 కోట్లతో నియోజకవర్గంలో పనులు
- ఎంపీ నామ నాగేశ్వరరావు


బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: 'మూడుసార్లు ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్యను ఆశీర్వదించారు.. నాలుగోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే మంచి పదవి వస్తుంది' అని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో 25 ఏళ్ల నుంచి కలిసి పని చేస్తున్నానని.. ప్రజాసేవ చేసే నాయకుడని కొనియాడారు. రూ.100 కోట్లతో సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మూడో సారి కూడా సీఎంగా కేసీఆర్ అవుతారని చెప్పారు. తెలంగాణ లో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్క డా లేవన్నారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించి, సామాజిక వర్గాల వారీగా భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కొందరు నిన్నటి వరకు ప్రశంసలు కురిపించి.. స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నారన్నారు. కాగా, నాలుగో వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ ప్రజల కోసం తండ్రి మట్టా రంగారావు జ్ఞాపకార్థం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించి ఉచితంగా మంచినీళ్లు అందిస్తానని ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ధరావత్ సాయి కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కూసంపూడి మహేశ్, తోట సుజలారాణి, మున్సిపల్ కమిషనర్ కె.సుజాతతోపాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వీరపనేని రాధిక, బాబీ, మట్టా ప్రసాద్, మేకల భవాని, అమరవరపు విజయనిర్మల, ఎస్‌కే మౌలాలి, వనమా వాసు, దొడ్డా శంకర్‌రావు, అద్దంకి అనిల్, వేములపల్లి పుష్పలత, మధు, చల్లగుండ్ల కృష్ణయ్య, ఎస్‌కే రఫీ, వల్లభనేని పవన్, మల్లూరు అంకమరాజు, నరుకుళ్ల శ్రీను పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

సత్తుపల్లిటౌన్: ఆరోగ్యానికి.. ఆనందానికి స్విమ్మింగ్ ఎంతగానో దోహదపడుతుందని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో డాల్ఫిన్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన స్విమ్మింగ్ పోటీ ల్లో విజేతలు సాత్విక్, జ్ఞానదీప్‌లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వయస్సుల వాళ్లకు ఈత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రామానుజం, సీఐ కరుణాకర్, చిత్తలూరి ప్రసాద్, పసుపులేటి నాగేశ్వరరావు, అవినాష్, కృష్ణారావు, గార్లపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరా ధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

8న స్వర్ణలక్ష్మి పూజలు

రామాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో వచ్చే నెల 8న సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వర్ణలక్ష్మి అమ్మవారి పూజా మహోత్సవం జరపనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించాలని, వారికి అమ్మవారి వెండి ప్రతిమ, జాకెట్ పీస్, ప్రసాదం, పూజా సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు. 7వ తేదీన హోలి రోజున రామచంద్ర స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరిస్తామని, ఆ రోజు నిత్యకల్యాణం నిలిపివేస్తున్నట్లు వివరించారు.

DCCB KHAMMAM ది జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం.
బోసుబొమ్మ సెంటర్, ఖమ్మం రూరల్ బ్రాంచ్, గుట్టలబజార్, ఖమ్మం.

బహిరంగ వేలము ప్రకటన

ఇ.పి.నెం.3748/2021-22, తేది: 18-01-2022

శ్రీ తేజావత్ బాలకృష్ణ, తండ్రి: దీప్ల, వీరి నివాసము: తీర్థాల, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా వీరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, బోసుబొమ్మ సెంటర్, ఖమ్మం రూరల్ బ్రాంచి నందు LTRCF SHEEP UNIT ఋణము తీసుకొని సకాలంలో చెల్లింపక వాయిదా మీరియున్నారు. అట్టి ఋణము వసూలు నిమిత్తమై వారికి హామీగా ఉన్నటువంటి శ్రీ తేజావత్ బాలకృష్ణ, తండ్రి: దీప్ల, వీరి నివాసము: తీర్థాల, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి తీర్థాల రెవెన్యూ గ్రామంలో ఉన్న ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించి బాకీని రాబట్టుకొనుటకు తేది.03-03-2023 తేదీన ఉ॥గం॥ 11-45 ని॥లకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయము, గాంధీచౌక్, ఖమ్మం నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు స్థిరాస్తి యొక్క వివరములు:

క్ర. నం.	సర్వే నెం.	విస్తీర్ణము	ఆస్తి యొక్క యజమాని పేరు	రెవెన్యూ గ్రామము	రెవెన్యూ మండలం	హద్దులు
1.	71/ఎ/ఎ/1	ఎ॥ 1.20 కుంటలు	శ్రీ తేజావత్ బాలకృష్ణ, తండ్రి: దీప్ల	తీర్థాల	ఖమ్మం రూరల్	తూ: భుక్యాసుఖ్యా ప: తేజావత్ రూప్లా ఉ: తేజావత్ హర్యా ద: భుక్యా రిక్కు
2.	823/ఎ/ఎ	ఎ॥ 0.25 కుంటలు	శ్రీ తేజావత్ బాలకృష్ణ, తండ్రి: దీప్ల	తీర్థాల	ఖమ్మం రూరల్	తూ: బోయిండ్ల వెంకన్న ప: బి.మోహనరావు ఉ: తేజావత్ చండి ద: తేజావత్ రూప్లా

వేలము షరతులు :

1) వేలములో పాల్గొను పాటదారుడు రూ.15,000/-లు ధరావతు (EMD) వేలమునకు ముందు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ఖమ్మం రూరల్ బ్రాంచి, బోసుబొమ్మ సెంటర్ పేరున డి.డి. తీసుకొని అట్టి డి.డి.ని సేల్ ఆఫీసర్ గారికి ఇచ్చి వేలములో పాల్గొనవలెను.
2) అత్యధిక పాటదారుడు పాటపడిన మొత్తములో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు ఆస్తిని తిరిగి వెంటనే వేలము వేయబడును.
3) వేలములో సరియైన ధర రానిపోయిననూ మరియు ఏ కారణములు చూపకుండా వేలము నిలుపు చేయుటకు లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలవు.
4) మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంప్ డ్యూటీ విలువ వేలం తేది నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాకు జమచేసి తిరిగి వేలం వేయబడును.
5) వేలం పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నెంబరు ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును.
6) పైన తెలుపబడిన భూములకు ఏకమొత్తంగా గానీ లేక సర్వే నెంబర్ల ప్రకారం విడివిడిగా గానీ వేలము వేయగల అధికారము కలదు.
7) భూమి వివరములు ఇచ్చుటలో గానీ వైశాల్యము వివరముల అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంక్ వారు బాధ్యులు కారని స్పష్టముగా తెలుసుకోవలెను.

ఇతర వివరములకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ / ఆఫీసర్-ఆన్-స్పెషల్ డ్యూటీ గారిని సంప్రదించవచ్చును.

ఇతర వివరముల కొరకు 9948987755, 9948312655 నెంబర్లకు సంప్రదించగలరు.

సం/- సేల్ ఆఫీసర్
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్,
ఖమ్మం రూరల్ బ్రాంచ్

విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం


సైన్స్‌ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందాల


మాట్లాడుతున్న రవిమారుత్

ఖమ్మంరూరల్: హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో స్ప్రింగ్ లీఫ్ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషిచేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోలేపల్లి పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో గల స్ప్రింగ్‌లైఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పెద్దపెద్ద విద్యాసంస్థలు ఖమ్మం నగరంలోనే ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు అక్కడికి వెళ్లి చదువుకోవడం ఇబ్బందికరమేనన్నారు. ఇలాంటి తరుణంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాలయాన్ని ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ హార్వెస్ట్ యాజమాన్యం జిల్లా విద్యారంగానికి చేస్తున్న సేవ అనిర్వచనీయమని పేర్కొన్నారు. కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న విద్యా పోటీలో తమ విద్యాసంస్థల ద్వారా ఒత్తిడిలేని, మానసిక వికాసంతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్


మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: నిజామాబాద్ మెడికల్ కళాశాల బాలుర వసతిగృహంలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి హర్ష మృతిపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం భగవాన్ నాయక్‌తండా గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి బానోతు నవీన్‌కుమార్ విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతూ మృతి చెందాడని, వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం చేసి మృత్యువుతో పోరాడుతోందని వెల్లడించారు. నిజామాబాద్ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థి హర్ష రాత్రి వరకు బాగానే ఉండి ఉదయం అనుమానాస్పదంగా చనిపోవడంపై వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రయోగించడం విడ్డూరమని ఇపేర్కొన్నారు. ఈ వరుస ఘటనలపై వెంటనే విచారణ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షులు దీపిక, కోశాధికారి లక్ష్మణ్, నాయ కులు గణేశ్, ప్రియాంక, నవీన్, సతీశ్ పాల్గొన్నారు.

వరిగడ్డివామి దగ్ధం

కల్లూరురూరల్: మండలంలోని మర్లపాడు గ్రామంలో వరిగడ్డివామి ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. గ్రామానికి చెందిన తొలికొండ సుబ్బారావు, బొంకూరు మారేశ్వరరావు, బొంకూరు కృష్ణారావుకు చెందిన వరిగడ్డివాములకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిబూడిదయ్యాయి. సత్తుపల్లి ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగానే ఫైర్ సిబ్బంది వచ్చి మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారుగా రూ.1.50 లక్షలకు పైగా నష్టం సంభవించినట్లు రైతులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ



తీవ్రంగా గాయపడిన వేణు (ఇన్‌సెట్) తమ్మరపు వేణు(ఫైల్)

ఏన్కూరు: యాష్‌ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన తమ్మరపు వేణు (34) కూలి పనులు చేస్తు జీవనం సాగించేవాడు. ఎక్కడ పనిదొరికినా అక్కడ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో భద్రాచలంలో కూలిపనులకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని ఆదివారం సెలవు కావడంతో తన స్వగ్రామం బాణాపురం వెళ్లేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై తన భార్య శ్రావణి ఇద్దరు కుమార్తెలతో కలసి బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ నుంచి పాల్వంచ వెళ్తున్న యాష్‌ట్యాంకర్ ఏన్కూరు సమీపంలో వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణు తీవ్రగాయాలపాలయ్యాడు. కుమార్తెలకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేణు మృతి చెందాడు. వేణు భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ములుగురూరల్: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో ఆదివారం ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడడంతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రామానికి చెందిన తాడూరి మనోహర్-లావణ్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఈనెల 21న హుస్నాబాద్ మండలం సందిళ్ల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై తిరుగుపయాణం అయ్యారు. ఈ క్రమంలో చల్వాయి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంబానికి లావణ్య(33) తల తగలడంతో తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందింది. మనోహర్, ఇద్దరు పిల్లలకు గాయాలు కాగా ములుగు ఏరి యా ఆస్పత్రికి తరలించారు. భర్త మనోహర్ ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పస్రా ఎస్సై కర్ణాకర్ రావు తెలిపారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత ఆదివారం మృతి చెందింది. స్థానిక హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బైగాని రజని (33) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ క్రమంలోనే తాను కుటుంబానికి భారంగా మారుతున్నట్లు మనస్తాపానికి గురై ఈ 13వ తేదీన ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గుర్తించిన భర్త సర్వేశ్వరరావు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రొక్కం వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ జవాన్...

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ నుంచి స్థానిక సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ 16వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు రోడ్డు తనిఖీ చేసుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓర్చాకు 3 కిలోమీటర్ల దూరంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి హెడ్ కానిస్టేబుల్ సంజయ్ లక్రా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అక్కడి నుంచి స్టేషన్‌కు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆర్మీ హెలికాప్టర్ ద్వారా నారాయణ్‌పూర్‌కు, అనంతరం మృతుడి స్వగ్రామం జష్‌పూర్‌కు తరలించారు. కాగా, సంజయ్ అంత్యక్రియలు సోమవారం అధికారిక లాంచనాలతో నిర్వహించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

కిష్టారం గ్రామానికి చెందిన వ్యక్తి..

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బోడు ఎస్‌ఐ రంజిత్ కథనం ప్రకారం.. కిష్టారం గ్రామానికి చెందిన మాడె ఎర్రయ్య (47) ఈనెల 13న తన మోటార్ సైకిల్‌పై మధ్యాహ్నం బోడు గ్రామానికి వెళ్లాడు. మధ్యలో పారికలవాగు దాటాక అదుపుతప్పి రోడ్డు పక్క వాగులో పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వస్తున్న వ్యక్తి చూసి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో గాయాలపాలైన ఎర్రయ్యను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మృతుడి కుమారుడు మాడె వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...



ప్రధాని మోదీతో ఏపీ గవర్నర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మాజీ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా జస్టిస్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.

నాటుపడవ బోల్తా

ఆరుగురు గల్లంతు..

పొదలకూరు: సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం విషాదంగా మారింది. ఒక గ్రామానికి చెందిన పది మంది యువకులు నాటు పడవలో చెరువులో షికారుకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర దుర్ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు కొత్త చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని గ్రామస్తులందరూ చెరువు వద్దకు చేరుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కళ్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ. కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్ (19) సా.5.30 గంటల ప్రాంతంలో చెరువులో నాటు పడవలో షికారుకెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ. కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగిలిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సమాచారం తెలుసుకున్న పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరీముల్లా గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన యువకుల ఆచూకీ దొరకలేదు.

ఏసీపీ నేతృత్వంలో నవీన్ హత్యకేసు దర్యాప్తు

- హరిహరకృష్ణతోపాటు స్నేహితులను ప్రశ్నించేందుకు సిద్ధమైన పోలీసులు
- నిందితుడి కస్టడీ కోసం నేడు కోర్టులో పిటిషన్ వేసేందుకు ఏర్పాట్లు


హరిహరకృష్ణ


నవీన్(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకేసులో దర్యాప్తు అధికారిగా వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నేతృత్వంలో పలు పోలీసు బృందాలు లోతుగా దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలను రాబట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలోనే విజయవాడ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే నవీన్, హరిహరకృష్ణతోపాటు ఇంకా ఎంతమంది అక్కడికి వచ్చారనేది తేలనున్నట్టు పోలీసులు చెప్తున్నారు. ఇక నవీన్‌ను హత్య చేసిన ప్రాంతానికి దగ్గరగా ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, బాటసింగారం ప్రాంతాలపై హరిహరకృష్ణకు ముందే స్పష్టమైన అవగాహన ఉన్నట్టు భావిస్తున్నారు. శివారు ప్రాంతాలు కావడం, పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటంతో.. నిర్మానుష్య ప్రాంతాలను ఎన్నుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం. నవీన్, హరిహరకృష్ణ, వారి స్నేహితులు గతంలో గంజాయికోసం ఈ ప్రాంతాలకు వచ్చి ఉంటారని, ఈ క్రమంలోనే హత్యకు నిర్మానుష్య ప్రాంతాన్ని సులువుగా ఎంచుకుని ఉంటాడని భావిస్తున్నారు.

నిందితుడి కస్టడీ కోసం నేడు పిటిషన్

ఈ కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ హత్యకు సంబంధించి హరిహరకృష్ణ, నవీన్ స్నేహితులను కూడా విచారించనున్నట్టు సమాచారం. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ.. ఆ తర్వాత నవీన్ స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు బయటికి వచ్చాయి. హరిహరకృష్ణ హత్యకు పాల్పడిన ఆందోళన, భయం వంటివేమీ లేకుండా మాట్లాడిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిందితుడి అన్నకూ నేర చరిత్రే..

ఖిలా వరంగల్: స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ స్వస్థలం వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతం. తండ్రి స్థానికంగా ఆర్‌ఎంపీ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. హరిహరకృష్ణ అన్న ముఖేశ్ గతంలో ఓ హత్యానేరంలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు హరిహరకృష్ణ తాను ప్రేమించిన యువతి కోసం స్నేహితుడిని దారుణంగా హత్యచేయడం కరీమాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది.

నవీన్ తల్లిదండ్రులు మమ్మల్ని క్షమించాలి

ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే అమ్మాయిని ప్రేమించడం దురదృష్టకరమని.. అయినా తప్పు చేసినవారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని నిందితుడు హరిహరకృష్ణ తండ్రి పేరాల ప్రభాకర్ పేర్కొన్నారు. తన కొడుకును ఉన్నతంగా చూడాలని అనుకున్నానని, కానీ ఇలా అవుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకును తానే స్వయంగా పోలీసులకు అప్పగించానని వివరించారు. నవీన్ తల్లిదండ్రులకు తీరని లోటు జరిగిందని.. వారు తన కుటుంబాన్ని పెద్ద మనసుతో క్షమించాలని విజ్ఞప్తి చేశారు.



విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణాలోని కురుక్షేత్రలో 16 రోజులపాటు జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ..ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞం జరిగిన తొలి ప్రాంతంగా కురుక్షేత్రలోని గుంతీ గ్రామం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు రాజుల కాలంలో చేపట్టినట్లు చరిత్ర ద్వారా తెలుసుకున్నామని, ఇప్పుడు కళ్లారా చూశామని తెలిపారు. భారతావనికి కచ్చితంగా శుభ దినం కాగలదని ఆకాంక్షించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ ఇది మహత్తర యజ్ఞమని అభివర్ణించారు. –సింహాచలం



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది తర్వాత గొర్రెల పంపిణీ

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండో విడత గొర్రెల పంపిణీ ఉగాది, శ్రీరామనవమి పండగల తర్వాత చేపడతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. గొర్రెల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ పథకం యూనిట్ వ్యయాన్ని కూడా పెంచుతామన్నారు. ఆదివారం సంగారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.300 కోట్లతో హైదరాబాద్‌లో గొల్ల, కురుమల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం గొల్ల, కురుమలను వాడుకుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.2 వేల కోట్లతో సరిపెట్టి, బీసీలకు అన్యాయం చేస్తోందని హరీశ్ విమర్శించారు. కురుమ సామాజిక వర్గంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవని, కల్యాణలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత ఈ బాల్యవివాహాలు బంద్ అయ్యాయన్నారు. రాష్ట్రంలో గొల్ల, కురుమలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కర్ణాటక మాజీ మంత్రి రేవన్న సీఎం కేసీఆర్‌ను కలిసి గొంగడి కప్పి అభినందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో రేవన్నకు ఏఐసీసీ నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. సభలో ఎంపీలు బీబీపాటిల్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాణిక్‌రావు, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గొల్ల కుర్మ సంఘం నేతలు నగేశ్, శ్రీహరి, పాండు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి హరీశ్‌రావుకు గొంగడి కప్పిన కురుమలు

తొలి గంటలో బిడ్డకు ముర్రుపాలు

సాక్షి, హైదరాబాద్: పుట్టిన తొలి గంటలో తల్లి నుంచి బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ, మాతా శిశు సంరక్షణ కేంద్రాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 'బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్‌నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా'ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇందుకోసం మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో లాక్టేషన్‌వర్కర్లను నియమించనున్నారు. దీంతోపాటు మాతా శిశు సంరక్షణ యూనిట్లలో తల్లిపాలకేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆస్పత్రుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వస్తున్నట్లు వైద్య వర్గాలు చెప్పాయి. తొలిగంటలోనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల అనేకరకాల జబ్బుల నుంచి రక్షణ ఏర్పడుతుంది. ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే తాగిస్తే..ఐదేళ్లలోపు పిల్లల మరణాలను 22% నివారించవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ శాతం సిజేరియన్ ద్వారానే బిడ్డను బయటకు తీయడం వల్ల వారు తొలి గంటలో ముర్రుపాలకు దూరమవుతున్నారు. ఆ సమయంలో బిడ్డకు తల్లి పాలిచ్చే పరిస్థితి ఉండటంలేదు. ఈ పరిస్థితిని నివారించేందుకే బ్రెస్ట్ ఫీడింగ్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

గుంటూరులో..



టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారని పాత ఫొటోలతో ప్రజలను మోసం చేసిన ఈనాడు దిగజారుడు పాత్రికేయ విలువలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా ఏపీ వ్యాప్తంగా ప్రజల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆదివారం కూడా ప్రజలు, వివిధ సంఘాల నేతలు, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనాడు తీరును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న రమేష్

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ నవనగర్‌కు చెందిన పి.రమేష్ రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఈఓ రజనీకుమారికి ఆదివారం అందించారు. రమేష్ దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు ఈఓ తెలిపారు. కాగా, కొత్తగూడెం బర్మా క్యాంప్‌నకు చెందిన పాలుమూరి భానుప్రసాద్ – కీర్తి దంపతులు అమ్మవారికి రూ.57 వేల విలువైన 10 గ్రాముల బంగారు ముక్కుపుడకను బహూకరించగా, వారికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శేషావస్త్ర ప్రసాదాలు అందజేశామని చెప్పారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.24,500


బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలిరావడంతో ప్రాజెక్టు పరిసరాలు కోలాహలంగా మారాయి. సందర్శకులు డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 387 మంది పర్యాటకులు తరలి రావడంతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,410, 220 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,190 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

జిల్లా వార్తలు

ప్రతిభ నై.. పైరవీలకే సై..



- క్రీడాకారుల ఎంపికల్లో అవినీతి, అక్రమాలు
- ముడుపులు ముట్టజెప్పేవారికి పెద్దపీట
- జిల్లా సంఘాలను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర సంఘాలు
- ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న 'శాట్స్'

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడా సంఘాల ముసుగులో దోపిడీ జరుగుతోంది. ఔత్సాహిక క్రీడాకారులు, ప్రతిభావంతులను పక్కనబెట్టి ప్రతిభ లేని వారిని జిల్లా, రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు ఆరోపణలు వస్తుండగా.. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పేలవమైన ప్రదర్శనతో వెనుదిరుగుతున్నారు. జట్టులో ఎంపిక కోసం ఒక్కో క్రీడాకారుడి నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా జిల్లాలోని కొన్ని క్రీడా సంఘాలపై ఉన్నాయి. అయితే ఈ అవినీతిలో రాష్ట్ర క్రీడా సంఘాలే జిల్లా సంఘాలను ప్రోత్సహిస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. కాగా, రాష్ట్ర జట్టులో స్థానం కోసం పెద్ద ఎత్తున నిధులను రాష్ట్ర సంఘాలకు ఇవ్వాల్సి ఉండడంతో తాము తప్పక వసూలు చేయాల్సి వస్తోందని జిల్లా బాధ్యులు చెబుతుండడం గమనార్హం. ఉదాహరణకు కనీసం పదిమంది ఉండాల్సిన జట్టులో పూర్తిస్థాయి ప్రతిభ కలిగిన ఐదుగురికే చోటు కల్పిస్తున్నారని సమాచారం. మిగతా ఐదుగురిని ఏ జిల్లా నుంచి అధిక మొత్తంలో రాష్ట్ర సంఘం బాధ్యులకు ముడుపులు చెల్లిస్తే ఆ జిల్లా వారికే స్థానం కల్పిస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఏటా జిల్లా క్రీడా సంఘాలు జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించే సమయంలోనే అందులో డబ్బు ఉన్న వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి 'మీ అబ్బాయి లేదా మీ అమ్మాయికి మంచి భవిష్యత్ ఉంది. అయితే, రాష్ట్ర జట్టులో ఎంపిక చేయడానికి ఖర్చు అవుతుంది.. ఎంత ఇస్తారో చెప్పండి' అని అడుగుతుండడంతో తల్లిదండ్రులు కూడా డబ్బు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారని సమాచారం.

'శాట్స్'లో కొరవడిన నిఘా..

గత కొంత కాలంగా క్రీడాకారుల ఎంపికల విషయంలో పూర్తిస్థాయి ఆధిపత్యం క్రీడా సంఘాలకే ఉండటం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) ఎలాంటి నిధులను అయా క్రీడా సంఘాలకు విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని క్రీడాసంఘాలు అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తిస్తున్నాయనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్ల నుంచి క్రీడా సంఘాలకు శాట్స్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో వాటిపై నిఘా కొరవడింది. దీంతో క్రీడాసంఘాలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో జరిగే వివిధ క్రీడా పోటీలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులను నియమిస్తారు. వారిది ఈ పోటీల్లో మొక్కుబడి పాత్రే ఉంటుంది తప్ప జట్టు ఎంపికలో సెలక్షన్ కమిటీకి ఎలాంటి సూచనలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేగాక సదరు పరిశీలకులకు సంబంధిత క్రీడకు బదులు ఇతర క్రీడలకు పరిశీలకులుగా నియమిస్తుండడంతో క్రీడా సంఘాలు ఆడిందే ఆటగా మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా, రాష్ట్ర ఒలింపిక్ సంఘాలు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా సంఘాల మీద పట్టు కోల్పోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా ఒకటి.. ఆడేది ఇంకో జిల్లా !

కొన్ని క్రీడా సంఘాల్లోని బాధ్యులు సొంత జిల్లా తరఫున ఒక జట్టు, ఇతర జిల్లాల తరఫున మరో జట్టు ఆడే విధంగా జిల్లా నుంచి రెండు జట్లను ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. అయితే రెండో జట్టులో ఉండే క్రీడాకారులు ఒకరిద్దరు సీనియర్ క్రీడాకారులను పెట్టి ఫలానా జిల్లా నుంచి కూడా క్రీడాకారులు వచ్చారని, వారికి ఎంపికల్లో అవకాశం కల్పిస్తున్నామని రాష్ట్ర సంఘం బాధ్యులు ప్రకటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని క్రీడాంశాల్లో ఇలా రెండు జట్లను తీసుకెళ్లి రాష్ట్ర టోర్నీలో ఆడించడం ఎంత వరకు సబబు అని పలువురు సీనియర్ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా క్రీడాకారుల ఎంపిక విషయంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పటిష్ట నిఘాను పెంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ సంఘాలతో బేజారు..

జిల్లాలో కొన్ని నకిలీ క్రీడాసంఘాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులే లక్ష్యంగా ఎంచుకుని దందా కొనసాగిస్తున్నారు. ముందస్తుగా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు లేకుండా జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తీసుకెళ్లడం లాంటి సంఘటనలు నిత్యం జిల్లాలో కొనసాగుతున్నాయి. అయితే కొందరు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ ప్రాబల్యం కోసం నేరుగా జాతీయ, అంతర్జాతీయ పోటీలను ఆడిస్తామని నామమాత్రమైన ప్రతిభ లేని క్రీడాకారులను ఎంపిక చేసుకుని నేరుగా అంతర్జాతీయ పోటీల పేరిట విదేశాలకు తీసుకెళ్తున్నారు. ఇలాంటి పరిణామాలపై ఇప్పటికే కలెక్టర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు నిఘా వేశారు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అనధికారికంగా వెళ్లిన / వెళ్తున్న క్రీడాకారుల వివరాలను సమీకరిస్తున్నారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

ఉష్ణతాపం.. కళా విహీనం..!



ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండదెబ్బకు చెట్లు మాడిపోతున్నాయి. ఆకులు రాలి చెట్లు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. కొత్తగూడెం ఎంజీ రోడ్‌లోని భారీ రావి వృక్షం వేసవి కాలానికి తలవంచింది. ఆకులు నేలరాలడంతో మోడువారింది. చాలామంది చిరువ్యాపారులు, బాటసారులకు ఈ చెట్టు నీడనిచ్చేది. ప్రస్తుతం ఆకురాలి మోడువారినా.. చిగుళ్లు రాకపోతాయా.. మునుపటి చల్లటి నీడ మళ్లీ దొరకకపోతుందా అనే ఆశతో వ్యాపారులు ఆ చెట్టు అడ్డాను వీడడం లేదు. - చుంచుపల్లి

జాతీయ టోర్నీకి ఐదుగురు ఆర్చర్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఆర్చరీ ఫలితాలను సీనియర్ పురుషుల విభాగంలో సాధించి ఐదుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లానుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్చర్లు కె.లక్ష్మన్, వి.పృథ్వీ, పి.నగేష్, ఈ.ఆనంద్ రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపిక కాగా, శివసాయి కాంపౌండ్ విభాగంలో జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఒకేసారి ఐదుగురు జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు సాధుల సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సీనియర్ ఆర్చరీ టోర్నీ గుజరాత్ రాష్ట్రం ఏక్తానగర్‌లో మార్చి 9నుంచి 18 వరకు జరగనుంది.


జాతీయ టోర్నీకి ఎంపికైన ఆర్చర్లు వీరే..

50 ఏళ్ల తర్వాత.. అ'పూర్వ' కలయిక !

వారంతా తాజా పూర్వ విద్యార్థులు కారు.. సుమారు 50 ఏళ్ల క్రితం.. 1968 – 72 సంవత్సరాల మధ్య ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి కెమిస్ట్రీ లెక్చరర్ కె.సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ 'విద్యార్థులు' నాటి స్మృతులను నెమరవేసుకున్నారు. అనేక మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతో అధ్యాపకులు, తోటి స్నేహితులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.వెంకట్రావు, కోటేశ్వరరావు, సైదులు, సీతారాములు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం సహకారనగర్



నాటి లెక్చరర్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

భారత ఉషూ జట్టుకు అన్నాచెల్లెలు ఎంపిక


పి.సత్యజిత్


పి.పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్ : ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2, 3 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు జిల్లాకు చెందిన అన్నాచెల్లెలు ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల జట్టుకు రాష్ట్రం నుంచి పి.సత్యజిత్, మహిళల జట్టుకు పి.పవిత్రాచారి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా సత్యజిత్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించగా, జాతీయస్థాయిలో పవిత్రాచారి ప్రతిభ చాటింది. పరిమితంగా ఎంపికలు నిర్వహించే పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు, అది కూడా అన్నా చెల్లెలు ఉండడం విశేషం. తండ్రి వద్ద శిక్షణ తీసుకుని అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న పి.సత్యజిత్, జాతీయ స్థాయిలో తిరుగులేని ఉషూ క్రీడాకారులుగా రాణిస్తున్న పవిత్రాచారి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి అభినందించారు.